కొద్దిపాటి ఆయాసంతో వగర్చుతూ ఇంట్లోకి అడుగుపెట్టాడు సుబ్రమణ్యం. వచ్చీ రావడంతోనే ఓ ఖరీదైన ఇన్విటేషన్ కార్డు అతని ముందుంచింది శ్యామల.


"అబ్బా! శ్యామూ... ఈవెనింగ్‌వాక్ చేసి వచ్చి ఆయాసంలో ఉన్నాను. అదేమిటో నువ్వే చెప్పు" అన్నాడు.

"రిటైరయిన దగ్గర్నుంచీ ఇలా మార్నింగ్ వాక్‌లూ, ఈవెనింగ్ వాక్‌లూ చేయడంతోనే సరిపోతోంది. ప్రపంచం ఎలావుందో కాస్త చూడొద్దూ?" విసుక్కుంది శ్యామల. భార్య చేతిలోని ఇన్విటేషన్ అందుకుని చూసాడు.

"అందరికీ ఆహ్వానం... మా బాబూ... బేబీల దత్తత స్వీకార మహోత్సవం... సకుటుంబ సమేతంగా రావలసిందిగా కోరుతున్నాము...

ఇట్లు
ఎ.ఆర్. మయ్యా
రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్
శ్రీమతి ఎ.ఎల్. లితారాణి
మహిళామండలి అదనపు కార్యదర్శి

సుబ్రమణ్యం భృకుటి ముడిపడింది. వెంట



# రెడియ-12

నే భార్య శ్యామల కళ్ళల్లోకి చూస్తూ "శ్యామూ... మన మయ్యాగాడు మళ్ళీ ఫంక్షన్ పెట్టాడు బాగానే వుంది. నెలకో, రెండ్నెల్లకో ఏదో ఒక ఫంక్షన్ ఏర్పాటు చేయందే వాడికి నిద్రపట్టదని మనకు తెలిసిందే. అయితే ఈ బాబీ, బేబీ లెవరూ?" దీర్ఘం తీస్తూ అడిగాడు.

"అవునండీ... మీ స్నేహితుడు మయ్యాగారి కి ఇద్దరూ అబ్బాయిలే. పెద్దబ్బాయికి ఒక్కతే పాప. రెండో అబ్బాయికి పోయిన శ్రావణ మాసంలోనే వివాహమయింది. వాళ్ళు అమె రికాలో సెటిలయ్యారు. మరి ఈ దత్తత స్వీకా రోత్సవం ఏమిటో అర్థం కాకుండా ఉంది" శ్యా మల కూడా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది.

"అసలేది చేసినా ముందు అర్థం కాకుండా చెయ్యటం- ఆ తర్వాత అర్థమయ్యేట్లు వివరిం చి షాక్‌కి గురిచెయ్యటం వాడికి మామూలేగా!"

"మరీనూ... లేకుంటే చక్కగా ఆకురాతి రామయ్య అనే పేరుని ఎ.ఆర్. మయ్యా అని, ఆకురాతి లలితారాణి అన్న పేరుని ఎ.ఆర్. లితారాణి అనీ కత్తిరించుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని కూడా గొప్ప ఫంక్షన్ చేసా డు" అంది శ్యామల.

"సరే... ఎటూ ఈ వింత కూడా చూద్దాం గానీ ఇంతకూ గంజి రెడీ చేసావా?" అడిగాడు సుబ్రమణ్యం.

ఉదయం, సాయంత్రం వాకింగ్‌చేసి వచ్చా క ఒక గ్లాసుడు గంజి త్రాగటం సుబ్రమణ్యం ఆహారపుటలవాటు.

"తప్పుతుందా?" అంటూ గంజి తేవటానికి వంటింట్లోకి వెళ్ళింది శ్యామల. అప్పటికప్పుడు రెండు ఆసనాలు అలఓకగా వేసేసాడు సుబ్ర మణ్యం.

సుబ్రమణ్యం తెలుగు లెక్చరర్‌గా చేసి రిటైర య్యాడు. ఒక్కగానొక్క కూతురికి చక్కని సంబం ధంచూసి పెళ్ళిచేసి బాధ్యత తీర్చుకున్నాడు. కూతురు, అల్లుడు బెంగుళూరులో ఉంటారు.

వంటింట్లోంచి గంజి గ్లాసుతో వస్తూనే శ్యా మల "మరయితే ఆ దత్తత స్వీకారోత్సవానికి వెళదామంటారా?"అడిగింది.

"భలేదానివే... వెళ్ళకపోతే వాడీసారి కనిపి స్తే కరుస్తాడు. వెళదాం. ఒకవేళ పాపం అనాథ పిల్లల్ని దత్తత తీసుకుంటున్నారేమో!" అన్నాడు.

"కావచ్చుండీ... నిజంగా ఎంత గొప్పమన సుంటే ఈ నిర్ణయం తీసుకుంటారు?" అంది. గంజి త్రాగటం పూర్తిచేసి ఇంటిపక్కనే ఉన్న స్థలంలో వేసిన మొక్కలదగ్గరకు వెళ్ళిపోయాడు సుబ్రమణ్యం. ఆ తోటలో మొక్కలను చూడనిదే నిద్రపట్టదు. శ్యామల కూడా భర్తను అనుసరిం చింది.

* * *

ఆదివారం ఉదయం ఆటో మాట్లాడుకొని, మొగల్రాజపురంలోని రిటైర్డ్ చీఫ్‌ఇంజనీర్ ఎ.ఆర్. మయ్యా అని పిలవబడే ఆకురాతి రామ య్య ఇంటిముందు దిగారు సుబ్రమణ్యం,

**పి.వి. రమణకుమార్**


శ్యామల.

చాలా ఖరీదైన పెద్ద బంగళా. చీఫ్ఇంజనీర్‌గా పనిచేస్తున్నప్పుడే తన అడ్డదిడ్డమైన సంపాదనతో కట్టించాడు ఎ.ఆర్. మయ్యా. ఇంటి ముందు టెంట్‌వేసి ఉంది. ద్వారానికి రెండు వైపులా ముచ్చటైన పిల్లలు, ముత్తయిదువులూ పూలు చల్లి, గంధంపూసి మరీ లోపలకు పంపించారు.

లోపల హాలంతా అతిధులతో కళకళలాడుతోంది.అందరినీ రిసీవ్ చేసుకుంటూ బాగా బిజీగా ఉన్న మయ్యా దంపతులిద్దరూ సుబ్రమణ్యం దంపతుల రాకను గుర్తించి, సాదరంగా ఆహ్వానించారు.

శ్యామల బాబూ, బేబీ అనే పిల్లలకోసం క్రితంరోజే ఖరీదైన రెడీమేడ్ డ్రస్సులు కూడా కొనుక్కొచ్చింది. ప్రాణస్నేహితులు కావడంతో అత్యంత ఖరీదైన అతిధులతోపాటు ముందు వరుసలో సుబ్రమణ్యం దంపతులను కూర్చోబెట్టారు.

హాలుకు తూర్పువైపుగా ఒక చిన్న వేదిక ఏర్పాటు చేయబడింది. వేదికమీద పంతులుగారు శాస్త్రోక్తంగా మంత్రాలు పఠిస్తున్నాడు. సమయం ఆసన్నమవడంతో మయ్యా దంపతులు మేడమీది గదిలోకి వెళ్ళి, ఓ పావుగంట తర్వాత ఖరీదైన పట్టు వస్త్రాలు ధరించి మెట్లు దిగి వచ్చారు. వారిద్దరి చేతుల్లో ఒదిగిపోయి ఉన్న జీవుల్ని చూసి అతిధులు చప్పట్లతో స్వాగతం పలికారు. వారిద్దరి చేతుల్లో రెండు బొచ్చు



డా॥ వి.వి. వేంకటరమణ రచించిన 'శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమ్ – సరళ తెలుగు వ్యాఖ్యాన' గ్రంథాన్ని టి.టి.డి. రామాయణం ప్రోజెక్ట్ ప్రత్యేకాధికారి డా॥ సముద్రాల లక్ష్మయ్య తిరుపతిలో ఆవిష్కరిస్తున్న దృశ్యం. సభాధ్యక్షులు శ్రీ సింగరాజు సచ్చిదానందం, డా॥ సర్వోత్తమరావు, డా॥ పేట శ్రీనివాసులురెడ్డి చిత్రంలో ఉన్నారు.

కుక్కపిల్లలు 'కుయ్... కుయ్...' మంటున్నాయి.

"అంటే! వీళ్ళు దత్తత స్వీకారం తీసుకుంటున్నది కుక్క పిల్లల్నా?" బోలెడు ఆశ్చర్యపోయింది శ్యామల.

"వాటి పేర్లే బాబూ... బేబీ...!" చెప్పాడు రహస్యం కనిపెట్టిన గూఢచారిలా సుబ్రమణ్యం.

'తాను రెడీమెడ్‌షాపుకు వెళ్ళి కష్టపడి సెలెక్ట్ చేసుకొచ్చిన డ్రస్సులు కుక్కలకనే' ఊహరాగానే బిగుసుకుపోయింది శ్యామల.

అందంగా అలంకరించబడిన వేదికపై భార్యాభర్తలిద్దరూ ఆశీనులయ్యారు. పంతులు గారు యధావిధిగా శాస్త్రోక్తంగా దత్తత స్వీకార తంతు పూర్తిచేయడంలో నిమగ్నమయ్యాడు.

కార్యక్రమం నిర్విఘ్నంగా సాగిపోతోంది. అతిధులుగా వచ్చిన నగర ప్రముఖులు తాము తీసుకొచ్చిన విలువైన బహుమతులు ఘనంగా సమర్పించుకుంటున్నారు.

సుబ్రమణ్యం శ్యామల కళ్ళల్లోకి ప్రశ్నార్ధకంగా చూసాడు. 'డ్రస్సులు ఇవ్వటం బాగుంటుందా'? అంటూ కళ్ళతోనే తిరిగి ప్రశ్నించింది శ్యామల.

'ఫర్వాలేదులే'! అంటూ సైగ చేసి శ్యామల చేతితోనే డ్రస్సుల ప్యాకెట్స్ మియ్యా భార్య లితారాణి చేతిలో పెట్టించాడు. ఆవిడ శ్యామలవైపు, సుబ్రమణ్యంవైపు అభినందనగా చూస్తూ 'థాంక్స్' చెప్పింది. ఈ సందర్భంగా అతిధులు అందజేసిన బహుమతులు ఒక టేబుల్‌పైన కుప్పలా పెరిగిపోయాయి. ఆ తర్వాత మొదలయింది ఘనమైన విందు భోజనం. వెరయిటీ రుచులతో అనేకరకాల పదార్థాలు వడ్డించబడ్డాయి. ఆ విందుభోజనాలు, బంధు పరివారాల పలకరింపులు చూస్తుంటే శ్యామల మనసులో రవ్వంత అసూయ రాజుకుంది. అందరూ ఎ.ఆర్. మయ్యా దంపతుల్ని అభినందించి, ఒక్కొక్కరే వీడ్కోలు తీసుకుంటున్నారు.

సుబ్రమణ్యం కూడా బయలుదేరాడు.

"అప్పుడేనా! సాయంత్రం వెళుదురులే ఉండండి..." చనువుగా అన్నాడు మయ్యా.

"మరోసారి వస్తాం... తీరిగ్గా మాట్లాడుకుందాం..." అన్నాడు బదులుగా సుబ్రమణ్యం.

"అనడమేగానీ! మీరు తీరుబడి చేసుకుని వస్తారా?" దీర్ఘం తీస్తూ అంది లితారాణి.

"ఏది ఏమైనా మీ దంపతులు కుక్కలక్కూడా సామాజిక స్థాయిని కల్పిస్తూ దత్తత తీసుకోవటం అభినందనీయం..." అన్నాడు సుబ్రమణ్యం.

"వ్వాట్? కుక్కలా? అన్నయ్యగారూ! దయచేసి వాటిని కుక్కలు అనకండి. నాకు బాధగా ఉంటుంది" ఫీలయిపోయింది లితారాణి.

ఖంగుతిన్న శ్యామల వెంటనే సర్దిచెబుతూ "అదే... ఆయన ఉద్దేశ్యం బాబూ.. బేబీలని" అంది.

ఆ సవరింపుతో కుదుటపడింది లితారాణి.

"సరే... ఇక ఎప్పటికప్పుడు మీ బాబూ, బేబీల ముద్దు ముచ్చట్లగురించి మీరు ఫోను చేయాలి. విని మేము కూడా సంతోషిస్తాం" అంటూ వారికిష్టమయ్యే రీతిలో మాట్లాడాడు సుబ్రమణ్యం. ఆ తర్వాత వాళ్ళదగ్గర వీడ్కోలు తీసుకుని వచ్చేసారు సుబ్రమణ్యం, శ్యామల.

★ ★ ★

రెండ్రోజులు గడిచిపోయాయి. ఈ రెండు రోజుల్లోనూ శ్యామల అసహనాన్ని ప్రదర్శించటం గమనించాడు సుబ్రమణ్యం. ఉండబట్టలేక

ఆ విషయమే అడిగాడు.

"మనం కూడా రెండు కుక్కపిల్లల్ని పెంచుకుందామండీ!" మెల్లగా చెప్పింది శ్యామల. సుబ్రమణ్యం ఆశ్చర్యపోతూ "కుక్క పిల్లల్ని పెంచడంలో రిస్క్ ఉంది శ్యామూ!" అన్నాడు.

"రిస్కేం ఉంటుంది చెప్పండి? మీ స్నేహితుడు మయ్యా, ఆయన భార్య లితారాణిలు కుక్క పిల్లల్ని దత్తత తీసుకుంటూ నలుగురిలో గౌరవంగా, హుందాగా... ఎంత వైభవంగా ఉన్నారు? వాళ్ళ జీవితాలు ధన్యమైపోయినంత సంతోషంగా ఉన్నారు. వాళ్ళు తీసుకున్న నిర్ణయం బాగుంది. రిటైరయ్యాక అలా కుక్కల్ని పెంచుకోవడమే బెటర్" తన వాదన వినిపించింది శ్యామల. సుబ్రమణ్యం భార్య వాదన విని చిన్నగా నవ్వుకొని –

"సరే శ్యామూ! అలాగే పెంచుకుందాం. ముందు మన మయ్యా వాడి ఫ్యామిలీ... బాబు, బేబీలు ఎలాఉన్నారో వాకబు చేద్దాం" అన్నాడు.

"అయితే ఇక ఆలస్యమెందుకూ? ఫోన్ చేయండి!" ఉత్సాహంగా చెప్పింది శ్యామల. సుబ్రమణ్యం ఫోనందుకున్నాడు. "హలో... మయ్యా... స్పీకింగ్..." అంతలోనే సుబ్రమణ్యాన్ని గుర్తుపట్టి "హలో మణ్యాం... ఏమిటీ సంగతులు?" అన్నాడు అవతల వైపు నుంచి మయ్యా.

"అందరూ బాగున్నారా?" ప్రశ్నించాడు సుబ్రమణ్యం.


ఈసారి మయ్యా గొంతు జీరబోయింది. హుషారులేదు. "ఆ...ఆ... బాగానే ఉన్నాం... ఈ రోజు ఉదయం నుంచీ బేబీ పాలు తాగకుండా ఒకటే అరుస్తూంటే, లిత డాక్టర్‌దగ్గరకి వెళ్ళింది. వాళ్ళు వెళ్ళిన దగ్గర్నుంచీ బాబు ఒకటే గోల... ఇష్... తల వాచిపోతోందనుకో..." చెప్పాడు మయ్యా. మయ్యా మాటలు శ్యామల కూడా స్పష్టంగా వింది. మరో రెండు నిమిషాలు మాట్లాడి ఫోను పెట్టేసాడు సుబ్రమణ్యం. శ్యామల ఆలోచన్లో పడిపోయింది. ఆమె ముఖకవళికలు గమనించి "ఒక వారం ఆగు శ్యామూ! అప్పుడు కుక్కపిల్లల గురించి నిర్ణయం తీసుకుందాం" అని చెప్పి తనకిష్టమైన గార్డెన్‌లోని మొక్కలవైపు నడిచాడు.

★ ★ ★

మరో నాలుగురోజులు గడిచిపోయాయి. ఒకరోజు ఉదయాన్నే మయ్యా ఫోన్‌చేసి "లిత మంచం పట్టిందని, కారణం... ప్రేమగా పెంచుకుంటున్న బాబు చెప్పాపెట్టకుండా ఇంట్లోంచి పారిపోయాడని, పోతూపోతూ కాలు కండ ఊడేట్లు కరిచి మరీ పారిపోయాడనీ" చెప్పాడు. మయ్యా గొంతులో విషాదం పలికింది.

ఇక ఆ సాయంత్రమే శ్యామలతోసహా కలిసివెళ్ళి మంచం పట్టిన లితారాణిని పరామర్శించాడు. కుక్కపిల్ల దిగులుతో భారీ శాల్తీ అయిన లితారాణి చిక్కి సగమయ్యింది. మయ్యా కూడా బాగా గెడ్డంపెంచి, లంఖణాలు చేసినవాడిలా ఉన్నాడు.

చిరకాల మిత్రుడు సుబ్రమణ్యాన్ని వాటేసుకుని, చిన్నపిల్లాడిలా బావురుమన్నాడు. ఆ దంపతులిద్దర్నీ ఎలా ఓదార్చాలో తెలియక సతమతమై తమకుతోచిన నాలుగు ఓదార్పుమాటలు చెప్పి ఏ కష్టమొచ్చినా కబురుపెట్టమని చెప్పి వచ్చేసారు. తిరిగి ఆటోలో ఇంటికి వస్తూంటే "ఇదేం చోద్యమండీ! కుక్కపిల్లల మీద దిగులేసుకొని బక్కచిక్కి పోవడం. అయ్యిందమ్మా పెళ్ళి, అణిగిందమ్మా రందీ... అన్నట్లు" అంది శ్యామల.




"ఒకవేళ మనుషులకన్నా కుక్కలే నయమనుకున్నారేమో!" అంటూ ముసిముసిగా నవ్వాడు సుబ్రమణ్యం.

★ ★ ★

వారంరోజులు గడిచిపోయాయి. ఒకరోజు సాయంత్రం సుబ్రమణ్యం దంపతులు గార్డెన్‌లో మొక్కలకు నీళ్ళు పడుతూండగా అనుకోకుండా వచ్చారు మయ్యా దంపతులు. వాళ్ళ ముఖాలు చూస్తూంటే సునామీవచ్చి సర్వం కోల్పోయిన వాళ్ళలా కనిపించారు.

"ఏమయింది? ఎందుకలా ఉన్నారు?" అడిగాడు సుబ్రమణ్యం. "బేబీ కూడా పారిపోయింది" కళ్ళొత్తుకుంటూ చెప్పింది లితారాణి. మయ్యా కూడా దాదాపు ఏడ్చేస్థితిలో ఉన్నాడు. వాతావరణాన్ని తేలిక చేస్తూ సుబ్రమణ్యం "ఈపాటిదానికి ఇంతగా కుమిలిపోవాలా? ఓ విషయం చెబుతాను వింటారా?" అన్నాడు.

"చెప్పు" అన్నాడు మయ్యా.

"రెండు కుక్కల్ని పెంచడంకంటే, పన్నెండు మొక్కల్ని పెంచడం హాయి. ఎందుకంటే ఇవి కరవవు, అరవవు... ఇంట్లోంచి పారిపోవు. ఏదో సరదాకి పెంచుకోవచ్చేగానీ వాటిమీద వల్లమాలిన ఆపేక్షలు పనికిరావు. ఇక మొక్కలు పెంచడంలో ఎన్నో లాభాలున్నాయి. పర్యావరణ పరిరక్షణకూడా చేసినవాళ్ళమవుతాం... ఏమంటారు?" ఇద్దర్నీ ప్రశ్నించాడు.

వాళ్ళిద్దరూ జ్ఞానోదయమయిన వారిలా ప్రశాంతంగా తలూపారు.

శ్యామల కాఫీ కప్పులతో వచ్చింది.

ఇకనుంచి మొక్కల పెంపకమే మా జీవితానందంగా బ్రతుకుతాం..." స్థిరంగా చెప్పాడు ఆకురాతి రామయ్య. ఔనన్నట్లుగా తల ఊపింది లలితారాణి.

సుబ్రమణ్యం, శ్యామల తృప్తిగా నవ్వుకున్నారు. గార్డెన్‌లో మొక్కలు చల్లగాలికి తలలాడించాయి. ●